క్లుప్తంగా

ఆర్మూర్ నుంచి యాదగిరిగుట్ట-స్వర్ణగిరికి ప్రత్యేక బస్సు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ ఆర్టీసీ డిపో నుంచి భక్తుల సౌకర్యార్థం యాదగిరిగుట్ట, స్వర్ణగిరి పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ రవికుమార్ శనివారం తెలిపారు. ఈనెల 27న యాత్రకు 36 సీట్ల సామర్థ్యం గల ప్రత్యేక బస్సు బయలుదేరుతుందన్నారు. ఈ బస్సు ఉదయం 6:00 గంటలకు ఆర్మూర్ డిపో నుంచి ప్రారంభమై తిరిగి రాత్రి 10:00 గంటలకు ఆర్మూర్‌కు చేరుకుంటుంది. ఒక్కరికి ఛార్జీ రూ.1500 ఉంటుందన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్మూర్, పరిసర ప్రాంత భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పేదలకు ఇందిరమ్మ ఇళ్లు వరం



ఆర్మూర్‌టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం పేదలకు ఓ వరం లాంటిదని మాజీ కౌన్సిలర్ ఖాందేష్ సంగీత అన్నారు. పట్టణంలోని రెండో వార్డులో శనివారం ఆమె ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేశారు. అలాగే లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రం అందజేశారు. నాయకులు ఖాందేష్ సత్యం, మున్సిపల్ అధికారులు చక్రధర్, రమేష్, వీణ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలకు విస్తృత ప్రచారం కల్పించాలి



రుద్రూర్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు విస్తృత ప్రచారం కల్పించాలని జహీరాబాద్ పార్లమెంట్ బీజేపీ కో-కన్వీనర్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం 11ఏళ్లు పూర్తిచేసుకుంటున్న సందర్భంగా రుద్రూర్ బీజేపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యశాల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నో చారిత్రాత్మక విజయాలతో మోదీ ప్రభుత్వం11 ఏళ్లు పూర్తి చేసుకుంటున్నదన్నారు. నాయకులు ఆలపాటి హరికృష్ణ, ప్రశాంత్‌గౌడ్, సుధాకర్‌గౌడ్, ఎముల గజేందర్, వినోద్ కుమార్, శివప్రసాద్, సాయిప్రసాద్, రాజేష్, శంకర్, అనిల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బోధన్ ఆస్పత్రి తనిఖీ



బోధన్‌టౌన్(బోధన్): బోధన్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని శనివారం కాయకల్ప బృందం సందర్శించారు. ఆస్పత్రిలోని అన్ని వార్డులను పరిశీలించి, రోగులకు అందిస్తున్న సేవలను వారు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. నివేదికను ఉన్నత అధికారులకు అందజేస్తామని వెల్లడించారు. బృందప్రతినిధులు వినయ్‌కుమార్, మరియ, మెగావత్, ఆస్పత్రి సూపరింటెండెంట్ రాహుల్, ఆర్‌ఎంవో రహీం ఉన్నారు.

దోమల నివారణ చర్యలు



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ గిరిజన బాలుర గురుకుల పాఠశాల, ఎస్సీ బాలుర వసతి గృహం, మామిడిపల్లి తపస్వీ తేజో నిలయంలో శనివారం వైద్య ఆరోగ్య సిబ్బంది దోమల నివారణ మందులను పిచికారి చేశారు. త్వరలో పాఠశాలలు పునఃప్రారంభం కానున్న సందర్భంగా ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు సిబ్బంది దోమల నివారణ చర్యలు చేపట్టారు. ఆరోగ్య కార్యకర్తలు మోహన్, గణేష్, సాగర్, నరేందర్ ఉన్నారు.

9న దివ్యాంగుల గుర్తింపు

బోధన్‌టౌన్(బోధన్): బడిబాట కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని మహాలక్ష్మి మందిరంలో ఈ నెల 9న దివ్యాంగుల గుర్తింపు కార్యక్రమం నిర్వహించనున్నట్లు స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీకన్స్ట్రక్షన్ సంస్థ కార్యదర్శి సిద్దయ్య అన్నారు. కార్యక్రమానికి మండలంలోని దివ్యాంగులు హాజరై, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గుణాత్మక విద్య అందించాలి

బోధన్: ప్రభుత్వ ఉపాధ్యాయులు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచి, వారికి గుణాత్మక విద్య అందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ సూచించారు. జిల్లాకేంద్రంలో శనివారం ఆయన ఎడపల్లి మండలం ఏఆర్‌పీ క్యాంప్ ప్రభుత్వ ఉన్నతపాఠశాల ఉపాధ్యాయులు ముద్రించిన బడిబాట కరపత్రాలను ఆవిష్కరించారు. హెచ్‌ఎం సురేందర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డేశారు.. వంతెన మరిచారు..

- నిరుపయోగంగా మారిన కల్లెడి-గుత్ప బీటీ రహదారి
- మార్గమధ్యలో ఒర్రెపై వంతెన నిర్మించని అధికారులు
- ఎల్లప్పుడు నీటిపారకం ఉండటంతో వాహనాలు వెళ్లలేని పరిస్థితి



కల్లెడి-గుత్ప మార్గమధ్యలో ఉన్న నీటి ఒర్రె

మాక్లూర్: మండలంలోని కల్లెడి నుంచి గుత్పకు సుమారుగా 6 కిలోమీటర్ల పొడవున నిర్మించిన బీటీ రోడ్డు నిరుపయోగంగా మారింది. మార్గమధ్యలో భారీ ఒర్రె ఉండటంతోపాటు నీటి ప్రవాహం కారణంగా వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సుమారు పదేళ్ల కిందట బీటీ రోడ్డు నిర్మించిన ప్రభుత్వం ఒర్రెపై వంతెన నిర్మించకపోవడంతో ఈ రహదారి వృథాగా మారింది.

పట్టించుకోని అధికారులు..

స్థానిక ప్రజల కోరిక మేరకు సుమారు పదేళ్ల కిందట అప్పటి ప్రభుత్వం కల్లెడి-గుత్ప గ్రామాల మధ్య బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.22కోట్లు మంజూరు చేసింది. రోడ్డు నిర్మాణం పూర్తిచేయగా, మార్గమధ్యలో ఉన్న ఒర్రెపై వంతెన నిర్మించడం మరిచారు. ఈ ఒర్రెలో ఎల్లప్పుడు నీరు పారుతుండటంతో వాహనాలతోపాటు పాదచారులు కనీసం కాలినడకన కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. వర్షాకాలంలో ఒర్రెలో నీరు భారీగా ప్రవహించడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం నెలకొంటుంది. దీంతో రోడ్డు నిర్మాణం వృథాగా మారుతోంది. మొదటిసారి వేసిన బీటీ రోడ్డు ఒక్కసారి పూర్తిగా దెబ్బతిని బీటీ కనిపించకుండా పోయింది. ఇటీవల రెండోసారి బీటీ రోడ్డుకు మరమ్మతులు చేశారు. కానీ వంతెన మాత్రం నిర్మించటం లేదు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి ఒర్రెపై వంతెన నిర్మించి, రోడ్డును అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

బ్రిడ్జి నిర్మించాలి..



పది సంవత్సరాల క్రితం బీటీ రోడ్డు నిర్మించారు. కానీ రోడ్డుకు మధ్యలో ఉన్న పెద్ద ఒర్రెపై వంతెన నిర్మించడం మరిచారు. ఒర్రెలో అన్ని కాలాల్లోనూ నీరు పారుతుంది. కనీసం కాలినడకన కూడ వెళ్లలేని పరిస్థితి ఉంటుంది. పాలకులు స్పందించి వెంటనే వంతెన నిర్మించాలి.

– గంగొల్ల ప్రశయ్‌తేజ్, బీజేవైఎం మండల అధ్యక్షుడు,కల్లెడి

నేటి చిత్రం

ట్యాంకు పరిసరాలను శుభ్రపర్చండి



బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్‌లోని వీఐపీ పుష్కరఘాట్ వద్ద భక్తుల తాగునీటి సౌకర్యం కోసం ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకు వద్ద పరిసరాలు అధ్వానంగా మారాయి. నీరు నిలిచి, చెత్తాచెదారం పేరుకుపోవడంతో భక్తులు నీటిని తాగడానికి ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే పరిసరాలను శుభ్రం చేయాలి

– సంజీవ్ కుమార్, పోచంపాడ్, మెండోరా మండలం

మాకు ఫొటో పంపండి

మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్‌లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.

ఆర్మూర్ : 90102 44405 | బాల్కొండ : 96666 49049 | బోధన్ : 99636 95349

భక్తి శ్రద్ధలతో బక్రీద్



నందిపేటలో ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు



బోధన్‌లో పోలీసు బందోబస్తును పర్యవేక్షిస్తున్న సీపీ సాయి చైతన్య



మాక్లూర్‌లో ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న జెడ్పీ మాజీ చైర్మన్ విఠల్‌రావు

సాక్షి నెట్‌వర్క్: ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లో శనివారం బక్రీద్ పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈసందర్భంగా అయా మండలాలు, గ్రామాల్లోని ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మత పెద్దలు పండుగ ప్రాముఖ్యతను వివరించారు. బక్రీద్ పండుగ త్యాగాలకు ప్రతీక అన్నారు. అనంతరం ఒకరినొకరు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అలాగే పలువురు నాయకులు ఈద్గాల వద్దకు చేరుకొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. బోధన్ శివారులోని ఈద్గాతో పాటు ఇతర ప్రార్థన మందిరాల వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తును సీపీ సాయి చైతన్య పర్యవేక్షించారు. బోధన్‌లోని ఈద్గా వద్దకు వచ్చిన సీపీ పోలీసు బందోబస్తు వివరాలను ఏసీపీ శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. సీఐ వెంకట నారాయణ సిబ్బంది ఉన్నారు.



ఆర్మూర్ పట్టణంలోని ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



పోతంగల్ మండలం హంగర్గాఫారంలో..



ఎడపల్లి మండలంలోని జాన్కంపేటలో..



నవీపేట మండల కేంద్రంలో..



ముప్కాల్ మండల కేంద్రంలో..



బోధన్ పట్టణంలో..



కందకుర్తిలో..



బాల్కొండ మండల కేంద్రంలో..



కమ్మర్‌పల్లిలో..

కరపత్రాల ఆవిష్కరణ



నందిపేటలో టీయూసీఐ మహాసభల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మహిళలు



ఆర్మూర్ పట్టణంలో..

నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలో శనివారం ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) ప్రథమ మహాసభల కరపత్రాలను సంస్థ ప్రతినిధులు, స్థానిక మహిళలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు పాశం సాయన్న మాట్లాడుతూ.. నిజామాబాద్‌లో ఈ నెల 21, 22 తేదీలలో టీయూసీఐ రాష్ట్ర మహాసభలలో భాగంగా ర్యాలీ, సభ నిర్వహిస్తామన్నారు. ఈ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్మిక నాయకురాలు మౌనిక, లహరి, కవిత, రాణి, దేవకి, శోభ ముత్తమ్మ, వసంత, మానస, గౌరసాయమ్మ, సునీత, లత, సవీత, మంజుల, చిన్నక్క, సుజాత, లక్ష్మి పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని దేశాయ్ బీడీ కార్యాలయం ముందు టీయూసీఐ మహాసభకు సంబంధించిన కరపత్రాలను సంస్థ నాయకులు శనివారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి ఎం ముత్తన్న మాట్లాడుతూ.. నిజామాబాద్ రూరల్, కామారెడ్డి సంయుక్త జిల్లా ప్రథమ మహసభ ఈనెల 18న సిరికొండలో నిర్వహిస్తున్నట్లు అన్నారు. అరవింద్, శేఖర్, గంగాధర్, విక్రమ్, రాధ, గంగామణి, పూజ, మంగమ్మ పాల్గొన్నారు.

రేషన్ కోసం తప్పని నిరీక్షణ



బాల్కొండ: మూడు నెలల రేషన్ బియ్యం ఒకేసారి పంపిణీ చేస్తుండటంతో ప్రజలు బియ్యం కోసం రేషన్ షాపుల వద్ద నిరీక్షించడం తప్పడం లేదు. బాల్కొండ మండలం కిసాన్‌నగర్‌లోని ఓ రేషన్ షాపును శనివారం ఉదయం 9గంటల వరకు కూడ తెరవక పోవడంతో ప్రజలు దుకాణం ముందు అలానే కూర్చుండి పోయారు. రాత్రి వరకు బియ్యం పంపిణీ చేయడంతో ఉదయం త్వరగా తీయడంలేదంటూ రేషన్ డీలర్లు తెలుపుతున్నారు. రేషన్ పంపిణీలో ఒక్కొక్కరికి అరగంట సమయం తీసుకోవడం వల్లనే ఆలస్యమవుతుందని లబ్ధిదారులు పేర్కొంటున్నారు.

ప్రభుత్వ బడుల్లోనే అన్ని సౌకర్యాలు



కుప్కల్ గ్రామంలో ప్రజలకు ప్రభుత్వ బడుల గురించి వివరిస్తున్న ఉపాధ్యాయులు



పోతంగల్ మండలం కారేగాం క్యాంపులో..

వేల్పూర్/రుద్రూర్/రెంజల్/వర్ని: ప్రభుత్వ బడుల్లోనే అన్ని సౌకర్యాలు ఉంటాయని, నిష్ణాతులైన ఉపాధ్యాయుల ద్వారా బోధన అందిస్తారని ప్రభుత్వ టీచర్లు ప్రచారం నిర్వహిస్తున్నారు. వేల్పూర్, రుద్రూర్, రెంజల్, వర్ని సహా పలు మండలాల్లోని గ్రామాల్లో శనివారం స్థానిక పాఠశాలల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అందించే సౌకర్యాలను ప్రజలకు వివరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని కోరారు. మోస్రా మండల కేంద్రంలో స్థానిక పాఠశాల విద్యార్థులతో ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు.



మోస్రాలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



కోటగిరి మండల కేంద్రంలో..



దూపల్లిలో..

నూతన కార్యవర్గం ఎన్నిక



బోధన్: బోధన్ మండల బీజేపీ నూతన కార్యవర్గాన్ని శనివారం పట్టణంలోని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేడపాటి ప్రకాష్‌రెడ్డి కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడు సిర్ప సుదర్శన్ అధ్యక్షతన, జిల్లా కార్యదర్శి మారోజు సుధాకర్ చారి సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు నాయకులు తెలిపారు. ఉపాధ్యక్షులుగా చామకూర మోహన్‌రెడ్డి, లోక సంజీవ్‌రెడ్డి, హన్మాండ్లు, ప్రధాన కార్యదర్శులుగా జంగం వెంకటేష్, లక్ష్మారెడ్డి, కార్యదర్శులుగా జయరాం, హేమశ్రీ, రేఖ, సౌందర్య బోనేకర్, కోశాధికారిగా బాబు, పలువురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

పోతంగల్‌లో..

రుద్రూర్: పోతంగల్ మండల బీజేపీ కార్యవర్గాన్ని విస్తరించినట్టు పార్టీ మండల అధ్యక్షుడు బజరంగ్ హన్మాండ్లు శనివారం తెలిపారు. ఉపాధ్యక్షులుగా గందపు మోహన్, నాగనాథ్ పటేల్, వెంకాగౌడ్, మాగిరి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శులుగా కల్లూరి మక్కయ్య, గుడిమెల శంకర్, కోశాధికారిగా సంజీవ్ మహరాజ్, సహయ కార్యదర్శులుగా కిరణ్ సేట్, విజయ్, బంజ గోవింద్, కిరణ్‌లతోపాటు 30 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

ఆలూర్ మాలమహానాడు కమిటీ..

పెర్కిట్(ఆర్మూర్): మాల మహానాడు ఆలూర్ మండల అధ్యక్షుడిగా ఆలూర్‌కు చెంది అగ్గు క్రాంతి నియమితులయ్యారు. ఆలూర్‌లో శనివారం మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నాగరాజు, జిల్లా అధ్యక్షుడు దేవిదాస్ అధ్యక్షతన సమావేశం నిర్వహించగా క్రాంతిని మండల అధ్యక్షుడిగా నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. అలాగే ప్రధాన కార్యదర్శిగా మిర్దాపల్లికి చెందిన చిట్టి బాబు, ఉపాధ్యక్షుడిగా మచ్చర్లకు చెందిన దండు రవి, కోశాధికారిగా గుత్పకు చెందిన పిట్ల శోభన్ ఎన్నికయ్యారు.



సినిమా

పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-3 శ్రీశ్రీశ్రీ రాజావారు-11.45
హౌస్‌ఫుల్-5 (హిందీ)- 2.55, 6.30, 10.00

స్క్రీన్-4 థగ్‌లైఫ్-11.35, 3.00,6.30, 10.00

మాంసం ధరలు (రూ..)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	180
		లైవ్	140
స్కిన్‌లెస్	200	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	97,500	వెండి(కిలో)	1,03,500
22 క్యారెట్స్	90,002		

– నిజామాబాద్ బిజినెస్

సంక్షిప్తం

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు మందుల బాలు శనివారం పలు బాధిత కుటుంబాలకు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో మొత్తం 49మందికి చెక్కులను పంపిణీ చేశామన్నారు. నాయకులు పాన్‌శీను, బాండ్లపల్లి నర్సారెడ్డి, ఖాందేష్ ప్రశాంత్, బాసెట్టి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

ఆర్మూర్‌టౌన్: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి, పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సీసీ సాయిచైతన్య అన్నారు. జిల్లాకేంద్రంలోని సీపీ కార్యాలయంలో సీపీ సాయిచైతన్యను శనివారం సామాజిక సేవకుడు పట్వారి తులసి మార్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా సీపీకి ఆయన తులసి మొక్కను అందజేశారు. సామాజిక కార్యక్రమాలు చేపడుతున్న తులసిని ఆయన అభినందించారు.

దళితరత్న అవార్డు ప్రదానం

నవీపేట: మండలంలోని నందిగామకు చెందిన నాగభూషన్‌కు శనివారం హైదరాబాద్‌లో దళిత రత్న అవార్డును ప్రదానం చేశారు. దళిత మహనీయుల జయంతి ఉత్సవాలలో దళితుల పక్షాన పోరాటం చేస్తూ, సేవా కార్యక్రమాలలో పాల్గొన్న సేవకులకు ఈ అవార్డును అందిస్తారు. ఉత్సవాల కమిటీ చైర్మన్ ఇటుకరాజు, దళిత నాయకులు మల్లని శివ, రాజ్‌గగన్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నట్లు నాగభూషన్ తెలిపారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపిక

వర్ని: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్)కు వర్ని మండలం వడ్డేపల్లి హైస్కూల్‌కు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం చంద్ర కిరణ్ రెడ్డి శనివారం తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ప్రతి సంవత్సరం రూ.12వేల చొప్పున నాలుగు సంవత్సరాల పాటు ఉపకార వేతనం ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు.

సీఎం రేవంత్ చిత్రపటానికి క్షీరాభిషేకం

కమ్మర్‌పల్లి: మండలంలోని నాగాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల పథకం మొదటి విడుత బిల్లులు మంజూరు కావడంపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు వారు శనివారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఏఎంసీ చైర్మన్ నర్సయ్య, పాలెపు రాజేశ్వర్, కంపదండి అశోక్, శిథర్, కిషన్, గంగాధర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కమ్మర్‌పల్లి: మండలంలోని బషీరాబాద్ గ్రామంలోగల ఐటీఐ కళాశాలలో వివిధ కోర్సుల్లో ప్రవేశాల కోసం అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కోటి రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డీజిల్ మెకానిక్, వెల్డర్, కోపా, డ్రెస్ మేకింగ్, ఐనా కోర్సుల్లో సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 94915 66890, 81067 94500 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

వంటచెరుకు తంటా..!



బాల్కొండ: మెండోరా మండలం నెహ్రూనగర్ కాలనీలో కూలీలు నివసిస్తున్నారు. వారి కుటుంబాలకు వంట గ్యాస్ సిలిండర్ కొనుగోలు చేసే సామర్థ్యం లేకపోవడంతో వంటచెరుకుతో వంటలు చేసుకుంటున్నారు. కుటుంబసభ్యులందరు వంటచెరుకు కోసం అడవి ప్రాంతంలోకి వెళ్లి కట్టెలను తీసుకువస్తుంటారు. ఈక్రమంలో శనివారం ఓ పదేళ్ల బాలిక పెద్ద కట్టెను తలపై పెట్టుకుని వస్తుండగా సాక్షి క్లిక్ మనిపించింది.